నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | మే 02, 2024 | www.navatelangana.com

పదిలో సత్తా చాటిన హర్షిణిప్రియ

నవతెలంగాణ-జైనథ్



ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో హర్షిణిప్రియ సత్తా చాటింది. మండలంలోని పూసాయి గ్రామానికి చెందిన దుబ్బ లక్ష్మీ రాజన్న కుమార్తె దుబ్బ హర్షిణిప్రియ 10జీపీఏ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్‌లో చదివిన విద్యార్థిని 10/10 జీపీఏ సాధించడం పట్ల పలువురు అభినందించారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని, విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు తెచ్చుకోవాలన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-సారంగాపూర్



నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకి తక్షణమే న్యాయం జరిగేలా చూడాలన్నారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆర్థిక, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రిసెప్షన్, టెక్నికల్ రూమ్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హనుమండ్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కపోతతో..ఉక్కిరిబిక్కిరి..!

- జిల్లాలో భగభగమండుతున్న ఎండలు
- ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులకు తప్పని తిప్పలు
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న కార్యకర్తలు
- పోలింగ్ ముంగిట పార్టీల్లో రేకెత్తిస్తున్న ఆందోళన

భగభగ మండుతున్న సూరీడు అందరినీ భయపెడుతున్నారు. ఎండవేడిమి తట్టుకోలేక అనేక మంది అస్వస్థతకు గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. ఎండ దెబ్బకు ప్రజలే కాదు..ఎన్నికల ముంగిట ఈ పరిస్థితి రాజకీయ పార్టీలకు తలనొప్పిగా మారుతోంది. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు ఎండవేడిమి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రచారంలో లోక్‌సభ పరిధి మొత్తం తిరిగి ప్రజలను కలువగలమా అనే ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఈ ఉష్ణోగ్రతలను భరించలేక అభ్యర్థుల వెంట కార్యకర్తలు కూడా వెళ్లేందుకు జంకుతున్నారు. ఎన్నికలేమో గానీ ఎండలో వెళితే ప్రాణం మీదకు వస్తుందని భయపడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం.. ఏకంగా 42డిగ్రీలపైనే నమోదు కావస్తుండటం అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఫలితంగా మరో పది రోజుల్లో పోలింగ్ జరగనుండగా.. అధిక ఉష్ణోగ్రతలు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు విజయమే లక్ష్యంగా పోరాడుతున్న రాజకీయ పార్టీలకు సైతం ఇబ్బందికర పరిస్థితి తలెత్తుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఓ వైపు ఎండవేడి..మరో వైపు ఎన్నికల వేడితో రాజకీయ పార్టీలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడం..అందులోనూ భరించలేని ఉక్కపోత మనుషులను అస్వస్థతకు గురిచేస్తోంది. ఈ ఎండవేడికి తట్టుకోలేక మనుషులే కాకుండా పశుపక్ష్యాదులు అల్లాడుతున్నాయి. ఎండదెబ్బ బారిన పడేలా చేస్తోంది. ఈక్రమంలో పల్లెలు, పట్టణాల్లో ప్రచారం చేయడం పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న రాజకీయ పార్టీలను ఆందోళనకు గురిచేస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రోజూ 42డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఎండను తీవ్రతను తెలియజేస్తోంది. ఈ క్రమంలో ఇంటింటి ప్రచారంలో నిమగ్నమైన అభ్యర్థులు, ఆయా పార్టీ శ్రేణులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండటం.. ఎండవేడిమికి వాటి పరిధిలోని పల్లెలు, పట్టణాల్లోని వార్డులన్నింటిలో ప్రచారం నిర్వహించడం కష్టతరంగా మారుతోంది. ఈ నెల 13న పోలింగ్ జరుగనుండటం.. ప్రచారానికి మరో పది రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఇంత తక్కువ వ్యవధిలో పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించగలమా అనే సందేహం వారిలో వ్యక్తమవుతోంది. గత నెలలో కేవలం మండల కేంద్రాలకే పరిమితమైన ప్రచారం కొన్ని రోజులు నుంచి పల్లెలు, వార్డులకు చేరడం.. అధిక ఉష్ణోగ్రతలు తట్టుకొని ప్రచారం నిర్వహించడం అభ్యర్థులకు సవాల్‌గా మారుతోంది.

జంకుతున్న కార్యకర్తలు..!

ఎండవేడిమి.. ఉక్కపోత తీవ్రస్థాయిలో ఉన్నా అభ్యర్థులు తప్పనిసరిగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కానీ వారి వెంట ప్రచారంలో పాల్గొనాల్సిన కార్యకర్తలు, శ్రేణులు మాత్రం వెనుకంజ వేస్తున్నారు. అభ్యర్థుల తరపున పల్లెలు, పట్టణాల్లో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీల కార్యకర్తలు, సానుభూతి పరులు అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకోలేకపోతున్నారు. ఎన్నికలు ఏమో గాని ప్రచారం ప్రాణాల మీదకు వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చాలా మంది ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 8గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో అభ్యర్థులు, వారి తరపున ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు ఉదయం 7గంటలకే ఆయా పల్లెలు, పట్టణాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు.. మళ్లీ సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. పగటిపూట కనీసం మూడు నుంచి నాలుగు గంటల పాటు ఎక్కడో ఓ చోట విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఎన్నికల సమయం తక్కువగా ఉండటం.. ఎండల తీవ్రత పెరడగం.. భరించలేనంత ఉక్కపోత కారణంగా అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజలందరినీ కలవకపోతే ఓట్లు రావేమోననే భయం పట్టుకుంది. ముఖ్యంగా కొందరు కార్యకర్తలు ఎండకు భయపడి ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. పార్టీ గెలిస్తే పదవులు రావడం ఏమోగానీ..ప్రాణం మీదకు వచ్చే పరిస్థితి కనిపిస్తోందని చెబుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



నవతెలంగాణ-బేల

మండలంలోనీ శంకర్‌గూడ చెక్ పోస్టును బుధవారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్ తనిఖీ చేసి, సిబ్బంధికి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని వారసంతకు వెళ్లి, అక్కడికి వచ్చే వివిధ ప్రాంతాల ప్రజలతో మమేకమై ఎన్నికల గురించి మాట్లాడుతూ వారికి ఎన్నికల గురించి ఎంత వరకు అవగాహన ఉందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట జైనథ్ సీఐ డి.సాయినాథ్, బేల ఎస్సై రాధిక ఉన్నారు.

సస్పెన్షన్ కొనసాగించకుంటే.. రాజీనామా చేస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

సస్పెండ్ చేసిన నేతలను తిరిగి తీసుకోవడం సరికాదని, వారిపై ఉన్న ఆరేండ్ల సస్పెన్షన్ను కొనసాగించాలని లేని పక్షంలో తాము ముకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ స్పష్టం చేశారు. సాజిద్ ఖాన్, గంగ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డిల సస్పెన్షన్ ఎత్తివేయడాన్ని నిరసిస్తూ బుధవారం కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు సంతోష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి రాజీనామ చేసి రెబల్‌గా కంది శ్రీనివాస్ ఓడించడానికి బీఆర్ఎస్ నుంచి డబ్బులు తీసుకోని పోటీ చేశారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ పార్టీలో చేరేందుకు చూస్తున్నారన్నారు. అధిష్టానం కూడా వారిపై ఉన్న ఆరేండ్ల సస్పెన్షన్ను కొనసాగించాలన్నారు. ఎంపీ అభ్యర్థి తరపున ప్రచారాన్ని కూడా నిలిపి వేశామన్నారు. అధిష్టానం నిర్ణయం మార్చుకోకుంటే ముకుమ్మడిగా రాజీనామలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచికట్ల ఆశమ్మ, ఉయిక ఇందిరా, మల్లరెడ్డి, షకిల్, జాఫర్ పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

నవతెలంగాణ-బోథ్



మండలములోని పార్డి(కే) గ్రామపంచాయతీ పరిధిలోని పరుపుల పల్లె గ్రామానికి చెందిన ఆత్రం జంగు(48) వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉపాధి హామీ పనికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వస్తుండగా ఒకేసారి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించే క్రమంలో మృతి చెందినట్లు గుర్తించారు.

పౌరహక్కుల రక్షణకు నిలబడుదాం

- అలుపెరుగని పోరాటం పుస్తకావిష్కరణ సభలో వాగ్గేయ కారుడు, కవి జయరాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై దాడులను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రకృతి కవి, ప్రజా వాగ్గేయకారుడు జయరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని యాదవ సంఘ భవనంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అలుపెరుగని పోరాటం పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు ప్రశ్నించే గొంతుకలు, ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ రచయితలు, ప్రగతిశీల జర్నలిస్టులపై ప్రభుత్వాలు నిర్బంధకాండకు పూనుకోవడం సరికాదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రగతిశీల మేధావులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. సైన్సు ఉద్యమకారులు నరేంద్ర దబోల్కర్, అభ్యుదయ రచయితలు గోవింద్ పన్సారే, కల్బుర్గిలను అత్యంత దారుణంగా హతమార్చారు. ప్రముఖ జర్నలిస్టు గౌరిలంకేష్‌ను ఇంటివద్ద కాల్చి చంపారు. స్టాన్ స్వామిని నిర్బంధించి హతం చేశారు. ప్రజా పోరాటాలకు మద్దతివ్వడం, రైతు పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేయడం వల్లనే న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థను అరెస్టు చేసి నిర్బంధించారు. ఆర్థికపరమైన నేరాలు రుజువు కానప్పటికీ ఆయన నిర్బంధాన్ని కొనసాగించడం పాలకుల ఫాసిజపు లక్షణాలను రుజువు చేస్తున్నాయని అన్నారు. ప్రశ్నించే గొంతుకలకు ప్రజలందరూ కూడా అండగా నిలబడాలని ఆయన కోరారు. ప్రజల హక్కులు కాపాడటం కోసం కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు కృషి చేయాలని కోరారు. మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు కంకణబద్దులై నిలబడాలని అన్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఓరగంటి అశోక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ఐక్యవేదిక నాయకులు ఎ.కిరణ్, పి.సచిన్, ఎం.సురేష్, డి.మల్లేష్, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కష్టపడే నాయకురాలు ఆత్రం సుగుణను గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడే నాయకురాలు, ప్రజా సేవలో ముందున్న మన ఆత్రం సుగుణను గెలిపించాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి కోరారు. బుధవారం పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్ బోర్డు సెకండ్ జోన్ కాలనీల్లో సుగుణకు మద్దతుగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, కాంగ్రెస్ మేనిఫెస్టో అంశాలను వివరించారు. రాష్ట్రం ప్రజా పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. త్వరలో రైతు రుణమాఫీ చేసి, చరిత్రను తిరగరాస్తామని అన్నారు. దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రధానిగా చూడాలని, బీజేపీ ప్రజావ్యతిరేక ప్రభుత్వం పోవాలని ప్రజలు కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన జిల్లా అధ్యక్షులు సాయిచరణ్ గౌడ్, మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, రహీమ్‌ఖాన్, వేముల నాగరాజు, రంజిత్‌రెడ్డి, నలిమెల నవీన్‌రెడ్డి, రెండ్ల రాజన్న, అడెల్లు, వెంకటేష్, గాలిపెల్లి నాగన్న, రూప, పద్మ, సంగీత పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి బీఆర్ఎస్ కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

బీసీల అభ్యున్నతికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, ఆత్మగౌరవ భవనాలు నిర్మించడం జరిగిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం పట్టణంలోని నూతిమీద గణపతి, రాణిసతిజీ కాలనీల్లో అభ్యర్థి ఆత్రం సక్కు తరపున ప్రచారం చేపట్టారు. ప్రజలను కలుస్తూ బీఆరెస్ అభివృద్ధిని వివరిస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. ఇస్త్రీ చేస్తూ, కుట్టు మిషన్ కుడుతూ కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత అధిక జనాభా ఉన్న బీసీల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి చేసిందన్నారు. ఏమి చేయలేదని చెబుతున్న ఎమ్మెల్యే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. బీజేపీకి స్పందన వస్తుందని చెబుతున్న ఎమ్మెల్యే ఎందులో వస్తుందో కూడా చెప్పాలన్నారు. ఓట్ల కోసం రాముని పేరును వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, సాజితోద్దీన్, మహిళా అధ్యక్ష కార్యదర్శులు స్వరూప మమత, పర్వీన్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, సంద నర్సింగ్, కోవ రవి, వెనుగంటి ప్రకాష్, పవన్ నాయక్, ధర్మ పాల్, కొండ గణేష్, పందిరి భూమన్న, రామ్ కుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ మెరిట్ లిస్ట్ విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్ 2024-25 మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని మోడల్ స్కూల్ ఆరు నుంచి పదవ తరగతి వరకు అడ్మిషన్ కోసం పరీక్ష రాసిన వారి మెరిట్ లిస్ట్‌ను వెబ్ సైట్‌లో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. మార్కులు, ర్యాంకుల వివరాలను తెలంగాణఎంఎస్.సీజీ.జీఓవీ.ఇన్‌లో విద్యార్థులు చూసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్..!

- కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల ముంగిట నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి దీప్‌దాస్ మున్షీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోవడం.. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో గులాబీ పార్టీకి దూరంగా ఉన్నారు. ఆ పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొనలేదు. కొన్ని రోజుల పాటు సైలెంట్‌గా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి కొన్ని రోజుల క్రితమే కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. కానీ నిర్మల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయన చేరికను వ్యతిరేకించారు. పార్టీలో చేర్చుకోవద్దని నిరసన తెలిపారు. దీంతో కొన్ని రోజుల పాటు ఆయన కాంగ్రెస్‌లో చేరిక వాయిదా పడింది. తాజాగా లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఆయన హస్తం పార్టీలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనతో పాటు బోథ్ నియోజకవర్గంలో తొలుత కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఉన్న వన్నెల అశోక్ సైతం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బోథ్ టికెట్ అశోక్‌కే కేటాయించినప్పటికీ.. వివిధ సమీకరణాల దృష్ట్యా ఆయన టికెట్‌ను రద్దు చేసిన పార్టీ ఆడె గజేందర్‌కు కేటాయించింది. దీంతో అసంతృప్తికి గురైన అశోక్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా దీప్‌దాస్ మున్షి ఆధ్వర్యంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం



నవతెలంగాణ-నార్నూర్

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలమైందని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని బేతాల్‌గూడ, నాగల్‌కొండ, మరపగూడ తదితర గ్రామ పంచాయతీలో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముందుగా వారు కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు పేదలకు అనేక అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కనక యాదవ్‌రావ్, మండల అధ్యక్షులు మెస్రం హన్మంతరావ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రీరాం నాయక్, వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, సీనియర్ జిల్లా నాయకులు యూనిస్ అక్బాని, కాంబ్లే ఉద్ధవ్, సయ్యద్ ఖాసీం, కనక ప్రభాకర్, మాజీ సర్పంచులు యూర్వేత రూపదేవ్, సుజాత పరమేశ్వర్, రాథోడ్ విష్ణు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విద్యార్థులు సెలవుల్లో సెల్ ఫోన్లు, టీవీలకు అంకితమై తమ భవిష్యత్తును చెడు మార్గంలో పోకుండా ఉండటానికి ఈ వేసవి శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని పౌర సమాజ సభ్యులు వెండి బద్రేశ్వర్ రావు అన్నారు. బుధవారం సంస్కార్ డ్రీమ్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి సైన్స్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో విద్యార్థులకు పాఠశాలలో బోధించని ఇతర కోకరిక్యులర్ యాక్టివిటీస్‌ని నేర్పడం అభినందయనీయమని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, వచ్చిన విద్యార్థులు పూర్తి సమయాన్ని ఈ వారం రోజులు వెచ్చించి నేర్చుకోవాలని అన్నారు. ఈ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉత్తమ పౌరులుగా ఎదుగుదలకు కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదికను అభినందించారు. ఈ శిక్షణలో గణితంతో గమ్మత్తులు, డ్రాయింగ్, గుడ్ హ్యాండ్ రైటింగ్, ఓరిగామి, సైన్స్ మ్యాజిక్ వంటి అంశాలపై అవగాహన కల్పించుకోవాలని అన్నారు. తమతో పాటు తమ స్నేహితులు కూడా సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, కోశాధికారి కత్తి శ్రీధర్ బాబు, జిల్లా బాధ్యులు ఎల్లుర్తి శ్రీనివాస్, పెంటపర్తి ఊశన్న, ఉమాకాంత్, మెస్రం రాజు, సురేష్, ఆత్రం సంతోష్, గెడం రవీందర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే తప్ప బయటకు రాకూడదని కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండల తీవ్రత రోజు రోజుకు ఎక్కువ వుతున్నందున జిల్లా ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటించి, వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. రోజు రోజుకీ ఎండలు పెరిగిపోతున్న దృష్ట్యా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎండ తీవ్రత నుంచి తప్పించుకోవచ్చని, రోజు మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలని, కొబ్బరి నీరు, నిమ్మకాయ నీళ్లు, పంచదార, ఉప్పు కలిపిన నీళ్లు తాగాలని ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, మంచినీళ్ల బాటిల్, తలకు క్యాప్ ధరించాలని పేర్కొన్నారు. రోజు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, రాగిజావా తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు.

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని శివగూడ, పాటగూడ, హనుమాన్ గూడలలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ఎస్సీ విభాగం ఇన్‌చార్జి లింగంపల్లి చంద్రయ్య అన్నారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోబిన్, సాగర్, రవి, ముజాహిద్, రహీం, పోతు రవి, గంగాధర్, బన్నీ నవీన్, ప్రవీణ్, దాసరి సత్యం పాల్గొన్నారు.

జనజాతర సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-నార్నూర్

రేపు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే జనజాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించి, మండల నాయకులతో సమావేశం నిర్వహించి సభకు సంబంధించిన పలు సూచనలు చేశారు. సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అజ్మీరా శ్యామ్‌నాయక్, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, ఎంపీటీసీ కోలట్కర్ పరమేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బ్రిజూలాల్, నాయకులు శేషారావ్ రాథోడ్, దాదేఅలి, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, నర్సింగ్ మోరే, కరీం ఖాన్, సత్తార్, షేక్ నసీర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

- మేడే స్ఫూర్తితో కార్మికవర్గం బీజేపీని ఓడించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ స్వాతంత్ర్యం కన్న ముందు, తర్వాత కాలంలో కార్మికవర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను నేడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. బుధవారం 138వ మేడే దినోత్సవాన్ని పురస్కరించుకోని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పట్టణంలోని సుందరయ్య భవనంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి కార్మికులకు, శ్రమ జీవులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ కార్మిక వర్గం ఎనిమిది గంటల పనిదినంతో పాటు అనేక హక్కులు మేడేతోనే సాధించుకున్నారన్నారు. ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచి సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కాలరాసిందన్నారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుగుణంగా కోడ్‌లుగా మార్చివేసిందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు నిరసనలు తెలుపుతున్న పట్టించుకోవడం లేదన్నారు. రైతాంగ చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా మార్చి 700 మంది రైతుల మరణాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కారణమైందన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక బీజేపీని ఓడించి ప్రజాస్వామిక లౌకిక వాదులను గెలిపించాలని, తద్వారా కార్మిక హక్కులు కాపాడాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మేడే స్ఫూర్తితో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బండి దత్త్రాత్రి, ఆర్.మంజుల, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, దర్శనాల నగేష్, పండుగ పొచ్చన్న, దేవిదాస్, హరిఫా బేగం పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో

1886 సంవత్సరంలో కార్మికుల శ్రమదోపిడికి వ్యతిరేకంగా ఎనిమిది గంటల పని దినం కావాలని, జరిగిన పోరాటంలో అసువులు బాసిన కార్మికుల రక్తం నుంచి ఎర్రజెండా పుట్టిందని, ప్రపంచ కార్మిక వర్గపు పోరాటాలకు దిక్సూచిగా మారిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్, రిమ్స్, మున్సిపల్, సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మేడే వేడుకలు నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ భారతదేశ కార్మికవర్గం అనేక త్యాగాల ద్వారా పోరాటాల ద్వారా సాధించిన 44 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు కంపెనీల యజమానులకు చట్టాలుగా మార్చి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకువచ్చిందని అన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మికులను దోపిడీచేసేలా వెట్టిచాకిరి బానిసలుగా మారేలా విధానాలను రూపొందించిన బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో కార్మికవర్గం ఓడించాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో నేడున్న పాలకులు తిరిగి 1886 కన్నా ముందుకాలానికి కార్మిక వర్గాన్ని తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 12 గంటల పని దినాన్ని చట్టబద్ధం చేశారన్నారు. సమ్మె హక్కును సంఘం పెట్టుకునే హక్కును భేరసారాల హక్కును దూరం చేశారని, కార్మికులను తిరిగి వేతన బానిసలుగా మార్చేలా కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్లను తీసుకువచ్చారన్నారు. ఈ లేబర్ కోడ్ ల రద్దుకై మేడే అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారతదేశ కార్మిక వర్గం రైతాంగం నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దారా దత్తం చేస్తున్నారన్నారు. విద్యా వైద్య రంగాలని వశం చేస్తూ వ్యాపారమయం చేసుకునేలా అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అవినీతిపరులందరినీ బీజేపీ పార్టీలో చేర్చుకుంటూ అవినీతిని చట్టబద్ధం చేస్తున్నారని ఆరోపించారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్యన కార్మిక వర్గం మధ్యన చీలికలు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తు రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. మేడే అమరవీరుల స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకై ఎనిమిది గంటల పని దినాలకు పోరాటాలకు పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ అధ్యక్ష, కార్యదర్శులు అక్రం ఖాన్, పెర్క దేవదాస్, పొచ్చన్న, దశాంత్, సుమన్ తాయి, ఏఆర్ఎస్ నాయకులు గంగన్న, శరత్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు భీంరావు, ఆశన్న, ఊశన్న, మున్సిపల్ నాయకులు అగ్గిమల్ల స్వామి, దర్శనాల నగేష్, మల్లేష్, అజీమ్ జనార్ధన్ జీవన్, టీఎంఎస్ఆర్‌యూ నాయకులు సదానంద్, శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పార్వతి పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

పదేండ్ల బీజేపీ పాలనలో కార్మికులకు కార్పొరేట్ రంగాలకు ఉపయోగపడేలా చట్టాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టిందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ అన్నారు. మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని నేతాజీచౌక్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోనీ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలు, పోరాటల గురించి తెలియాజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ 138 ఏండ్ల క్రితం పోరాడి 8 గంటల పని దినాలు సాధించుకున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ వాటిని తొలగించి కార్పోరేట్ సంస్థలకు అనుగుణంగా చట్టాలను తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన కాంతారావు, అధ్యక్షుడు మెరుగు చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా నాయకులు అశోక్, సురేష్, తెలంగాణ మెడికల్ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డొంగ్రే చందు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముజీబ్, రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఖాసీం, జిల్లా నాయకులు శ్రీకాంత్, రవి, రమేష్, సంగీత, సివిల్ సప్లయ్ హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు అఫ్రోజ్, సలీం, మార్కెట్ యార్డ్ యూనియన్, హమాలి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో...

వందేండ్ల క్రితం పోరాడి సాదించిన కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్లుగా చేసి కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ఐఎఫ్టీయూ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి టీ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఐఎఫ్టియు ఆధ్వర్యంలో పిట్టలవాడలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మిక చట్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియూ జిల్లా కార్యదర్శి వెంకట నారాయణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, జిల్లా కన్వీనర్ కళావతి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరిష్, మడావి గణేష్, సుభాష్, నర్సింగ్, దేవిదాస్ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో

అమెరికా చికాగో నగరంలో పుట్టిన ఎర్రజెండా నేడు కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సీపీఐ పార్టీ కార్యాయలంలో బుధవారం 138వ మేడేను పురస్కరించుకోని పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్మికులు, పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 8 గంటల పని దినాల కోసం అమెరికా చికాగో నగరంలో కార్మికులు ఐక్యంగా ఉండి ఉద్యమించారన్నారు. అక్కడి ప్రభుత్వం కాల్పులు జరపడంతో రక్తపు మడుగులో షార్టులను ముంచి ఎర్ర జెండాను చేశారన్నారు. అదే నేడు కార్మికులకు అండగా ఉంటూ పోరాడుతుందన్నారు. ప్రభుత్వాలు కూడా కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నళినిరెడ్డి, కుంటాల రాములు, దేవిదాస్, అమినా, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ కార్మిక హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో...

హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలంగాణ కార్మిక హమాలీ యూనియన్ డైరెక్టర్ సిడాం రాంకిషాన్ ఆరోపించారు. బుధవారం మేడేను పురస్కరించుకోని యూనియన్ ఆధ్వర్యంలో కిసాన్ చౌక్‌లో జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, సమస్యలపై చర్చించారు. పట్టణంలోని హమాలీ కార్మికులు అనేక సమస్యలతో బాదపడుతున్నారని అన్నారు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించడం లేదన్నారు. కార్మికులకు రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఇండ్లతో పాటు సంఘ భవనం కూడా లేదన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు నమ్మకం ఉందని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ బాబు, అహ్మద్, మనోజ్ చౌదరి, అశోక్, జావిద్ ఖాన్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో...

ఎందరో మహానుభావులు కార్మిక నాయకులు వాళ్ల త్యాగాలు ఫలితంగానే నేడు కార్మికులు ఎనిమిది గంటల పని దినాన్ని అనుభవిస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భీమ్‌రావు అన్నారు. బుధవారం ఆర్టీసీ డీపో ఎదుట మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపరీతమైన పని భారం శ్రమ దోపిడీ నిత్యాకృత్యమైనాయి, సంస్థలో సంఘాలు లేవని పేరు మీద అధికారులు తమ ఇష్టారీత్యంగా కార్మికులపై వేధింపులకు దిగుతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో 2013 సంవత్సరపు వేతన సవరణ వేతనాలు ఇప్పటికి తీసుకుంటూ దయనీయంగా జీవితాలను వెలదీస్తున్నారన్నారు. ఆర్టీసీ కార్మికులు ఓ పక్క అధికారుల వేధింపులు పనిబారాలు పెంపు, దానికి సరిపడా ఓవర్ టైం చెల్లించకుండా శ్రమదోపిడి, ఈ విధంగా అడిగే నాధుడే లేడని ధీమాతో అధికారులు కార్మికులపై జలూం చలాయిస్తున్నారన్నారు. ఇక నుండి ఇలా నడవడానికి వీల్లేదని కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ఎస్‌డబ్ల్యుఎఫ్, సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటానికి ముందు ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో అనిత, ఎం.నారాయణ, ఊశన్న, ఎస్‌వి సాగర్, అధ్యక్ష కార్యదర్శులు అశోక్, ఎం.ఆశన్న, సురేష్, నారాయణ, వెంకటేష్, దేవిదాస్, అనిల్, సుభద్రభాయి, గోదావరి, ప్రమీల, నస్రినా బేగం పాల్గొన్నారు.

ఉట్నూర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్మిక పోరాట త్యాగాలా ద్వారా సాధించించుకున్న 8 గంటల పని స్థానంలో కార్పొరేట్ కంపెనీలకు, యజమానులకు లాభమయ్యే విధంగా 12 గంటల పని విధానం తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మేడే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులపై భారాలు మోపుతుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటు పరంగా చేస్తూ, దేశ సంపదను కార్పొరేట్ బడా బాబులకు దోచి పెడుతుందని అన్నారు. ప్రజల్లో మతం ఆధారంగా విభజన తీసుకువచ్చి ప్రజల మధ్య వైషమ్యాలు తెస్తుందని దుయ్యాబట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆనంద్, రత్నమాల, నైతం శోభా, నర్మద, శ్రీను, గ్రామ పంచాయితీ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, ఆశ కార్మికులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో...

మండలంలోని కేబీ కాంప్లెక్స్, అంగడి బజార్, ఎన్ఆర్ నగర్, పాత ఉట్నూర్, కొత్త బస్టాండ్, ఐటీడీఏ చౌరస్తా, తెలంగాణచౌక్, నవోదయ నగర్, హనుమాన్ నగర్, పాత బస్టాండ్ ఆర్టీసీ కార్మికులు, తాపిమేస్త్రి, గ్రామపంచాయతి కార్మికులు, విద్యుత్‌శాఖ కార్మికులతో పాటు ఉట్నూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో మేడే జెండాలను ఎగురవేశారు. బుధవారం ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ మాట్లాడుతూ 1886 మే 1న అమెరికా చికాగో నగరంలోని హే మార్కెట్‌లో 8 గంటల పని దినం కోరుతూ లక్షలాది కార్మికుల ప్రదర్శనపై ఆనాటి పాలకవర్గం ఆదేశాలతో పోలీసులు ప్రదర్శన కారులపై విచక్షణంగా రహితంగా కాల్పులు జరిపారు. అయినప్పటికి కార్మికులు వెనక్కి తగ్గలేదు. ఆ పోరాటంతోనే కార్మికులు 8 గంటల పని దినాన్ని సాధించుకున్నారు. ఆ దినాన్ని తలుచుకొని మే 1న మేడే వేడుకలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న నిత్యవసర ధరలను అనుగుణంగా కార్మికుల వేత్తనాలు పెంచడానికి గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. జనవరి 1 నుంచి కార్మికుల వేత్తనాలు పెంచాల్సి ఉంది కానీ అది జరగడం లేదని అన్నారు. కనీసం జారీ చేసిన జీఓలు అమలు చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జాదవ్ గణేష్, జాదవ్ నరేష్, రాథోడ్ నాందేవ్, రాథోడ్ ధర్మరాజ్, రాథోడ్ లాల్‌సింగ్, ఆడే రవీందర్, ఆడే దేవ్‌రావు, టేకుల వెంకటేష్, గడ్డం శ్రీనివాస్, చాకటి మాణిక్‌రావు, టేకుల గంగాధర్, తాపిమేస్త్రీ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు సన్మానం

మండలంలోని లక్కారం గ్రామపంచాయతీ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారికి సామాజిక కార్యకర్త అజ్మీరా జయచంద్ర నాయక్ బుధవారం శాలువాలతో సన్మానించి, మిఠాయిలు తినిపించి, కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర కీలకమని, కష్టానికి ఫలితం ఎప్పుడు ఉంటుందని అన్నారు. కార్మికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సంతోషంగా తమ విధులను నిర్వహించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్: సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో

లక్ష్మణచాంద : మండలకేంద్రంలో మేడే దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ నాయకురాలు బాపట్ల లలిత ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి, సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నమాల, పెద్దమ్మ ప్రేమల, ఆశ, విజయ, వనిత పాల్గొన్నారు.

కడెం : మండల కేంద్రంతో పాటు మండలలలోని పలు గ్రామాల్లో బుధవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కార్మిక జెండాలను డివిజన్ కార్యదర్శి రాజేష్ ఎగరవేశారు. అలాగే మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద సీఐటీయూ జెండాను నిర్మల్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి డాకూరి తిరుపతి ఎగరవేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి రాజేష్ మాట్లాడారు. కార్మికుల పోరాటాల ఫలితంగా 8 గంటల పని దినాన్ని సాధించుకున్న తరణంలో కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ లను రద్దు చేస్తూ 4 కోడ్లుగా కుదించడం సరికాదని మండిపడ్డారు. కార్మికుల హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, నాయకులు చిన్న రాజన్న, రాజేశ్వర్, సత్తన్న, నిర్మాణ సంఘ జిల్లా అధ్యక్షులు కోటన్న, భీమన్న పాల్గొన్నారు.

ఖానాపూర్ : మండలంలో ఆయా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 138వ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నందిరామయ్య, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్, రైతు సంఘం, సీఐటీయూల ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్యలు వేర్వురుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారుల పాలకవర్గాల దోపిడీ, దాడులు, అణిచివేతలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించుకుంటూ వర్గ ఐక్యతను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

బజార్‌హత్నూర్ : మేడేను పురస్కరించుకుని బుధవారం మండలంలోని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సీఐటీయూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద ఎర్రజెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమాలీ సంఘం అధ్యక్షులు తడక శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక హక్కులకై చికాగో నగరంలో లక్షలాదిమంది కార్మికులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేస్తున్న వారి పైన పెట్టుబడిదారీ వర్గం కాల్పులు చేపట్టడంతో కార్మికుల రక్తంతో తడిసిన జెండా ఎర్ర జెండా అని అన్నారు. కార్మికులు పోరాటాల ద్వారానే హక్కును సాధించుకున్నారు. ఆ హక్కులను కాపాడుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా బాధ్యులు సురేష్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మోత్కూరి దేవేందర్, హమాలీ కార్మికులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రాంతికారి హమాలీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు షేక్ సైజాద్ హుస్సేన్ మాట్లాడుతూ కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో కార్మికుల సమస్యలు ఎన్నో ఉన్నాయని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ స్పందిచడం లేదని అన్నారు. అధికారులు స్పందిస్తూ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా మాలిక్ కార్మిక సంఘం డైరెక్టర్ ఎల్ల సంతోష్ కుమార్ మాట్లాడుతూ మేడే సందర్భంగా కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శాలిక్‌రావ్, ఉపాధ్యక్షులు ఆడే విఠల్, సంఘం జనరల్ సెక్రటరీ అఫ్రోజ్, హుస్సేన్, ముఖ్య సలహాదారులు మునేశ్వర్ సుదర్శన్, దూట రాజేశ్వర్, ఆనంద్ కుమార్, షేక్ రసూల్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో...

ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ అనుబంధ సంఘాలు కుమురంభీం గూడా నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేడే కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ మాట్లాడుతూ మేడే అంటే కార్మిక, కర్షకుల దినోత్సవమని అన్నారు. చికాగో నడిబొడ్డున చిందిన రక్తపు చిహ్నం బానిస బతుకులకు చరమగీతం పాడిన దినం మేడే అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 8 గంటలే కార్మికులతో పని చేయించాలి కాని పెట్టుబడిదారులు ఇప్పటికీ కుడా అమాయక కార్మికులతో ఎక్కువ సమయం పని చేస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ఎంతోమంది శ్రమజీవులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. వారిలో ధైర్యం నింపడం మన అందరి కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకురాలు గోడం రేణుక, సోయం లలిత, కుడ్మెత ప్రకాష్, డివిజన్ ఉపాధ్యక్షుడు, వెడ్మ ముకుంద్‌రావు, మావల మండలాధ్యక్షులు పంద్రం గంభీర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కుమ్ర గోవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాంసి : 138వ కార్మిక దినోత్సవాన్ని బుధవారం తాంసి, భీంపూర్, మండల కేంద్రంలో సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు వెంకటమ్మ ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ మండల అధ్యక్షులు తోట నరేందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్మిక సంఘం సభ్యులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ఎంపీటీసీ నరేష్, కార్మిక సంఘం నాయకులు పొచ్చన్న రతన్, విలాస్, దత్తు, రాములు పాల్గొన్నారు.

ఇచ్చోడ : మేడే స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మేడే వేడుకలకు ఆయన ముఖ్యఅతిధిగా హజరై ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెట్టి చాకిరికి అణచివేతకు, పీడనకు వ్యతిరేకంగా ఎనిమిది గంటల పని దినం కోసం కార్మిక హక్కుల సాధన కోసం 1886లో హే మార్కెట్లో కార్మికులు చేసిన పోరాటంపై నాటి పాలకవర్గాలు దాడిచేసి అనేకమంది కార్మిక నాయకుల్ని బలితీసుకుందని అన్నారు. ఆ త్యాగాల ద్వారానే అనేక దేశాల్లో 8 గంటల పనిదినం అమల్లోకి వచ్చిందని అన్నారు. అనంతరం కార్మికవర్గం అనేక త్యాగాల ద్వారా పోరాటాల ద్వారా కొన్ని చట్టాలను హక్కులను సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు భూమయ్య పవార్ జితేందర్ పాల్గొన్నారు.

నార్నూర్ : మేడేను పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, మధ్యానం భోజన కార్మికుల మండల నాయకులు ఝాడే నాందేవ్, జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమకు ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల కార్మికులు ఝాడే తాయిబాయి, తానుబాయి, ఝూరుబాయి, తులిసిబాయి, సమాధాన్ రామ్ ఉన్నారు.

తలమడుగు : మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. మొదటగా జెండా ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ భారతదేశ కార్మికవర్గం అనేక త్యాగాల ద్వారా పోరాటాల ద్వారా సాధించిన 44 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు కంపెనీల యజమానులకు చుట్టాలుగా మార్చి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకువచ్చిందన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి, కార్మికులను దోపిడీచేసేలా వెట్టిచాకిరి బానిసలుగా మారేలా విధానాలను రూపొందించిన బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికవర్గం ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం కిష్టన్న, సీఐటీయూ తలమడుగు మండల నాయకులు కళావతి, మంజుల, రమణ, గంగమ్మ, కృష్ణ, గంగన్న, ప్రమోద్, భూమన్న పాల్గొన్నారు.



ఉట్నూర్: టీఏజీఎస్ ఆధ్వర్యంలో..



తలమడుగు



తాంసి



ఇచ్చోడ



లక్ష్మణచాంద



బజార్‌హత్నూర్



ఆదిలాబాద్‌టౌన్: ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో...



ఆదిలాబాద్‌రూరల్

బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ముత్తు బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణం ఎఫ్ కాలనీలో ఉచిత బాక్సింగ్ సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ క్యాంప్‌ను జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ ఛైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ఎక్స్‌ఆర్మీ అసోషియేషన్ అధ్యక్షుడు శివ నాయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివనాయర్ మాట్లాడుతూ ఈ ఉచిత బాక్సింగ్ శిబిరం ఈ నెల 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌లను అందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మధురై శేఖర్ పాల్గొన్నారు.

వేసవి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, వడదెబ్బకు గురైన వారు పాటించాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం ఈ నెల 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం సమయంలో అత్యవసరం అయితేనే బయటకు రావాలని తెలిపారు. ప్రతి ఆశా కార్యకర్త వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల ప్రదేశాలలో ఉపాధి కూలీలకు నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్, మెడికల్ కిట్లు ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం పోరాటం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న



మేడే వేడుకలు జరుపుకుంటున్న సీపీఐ (ఎం), సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మేడే ఇచ్చిన స్ఫూర్తితో రాబోయే రోజులలో కార్మికులు సంఘటితంగా తమ హక్కుల కోసం పోరాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. మేడే సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో జెండాలను ఆవిష్కరించారు. రాజీవ్‌చౌక్, మున్సిపల్ కార్యాలయం, సీహెచ్‌సీ వద్ద సీఐటీయూ పతాకాలను, సంజీవయ్యకాలనీ, సర్దార్‌బస్తీ, పార్టీ కార్యాలయం, ఎస్పీఎం వర్కర్స్ గేటు ముందు పార్టీ పతాకాలను, విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు టీఎస్‌యుఈఈయు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో వివిధ సంఘాల కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూశన రాజన్న మాట్లాడుతూ నాడు చికాగో నగరంలో కార్మికులు అలుపెరుగని పోరాటం చేసి సాధించుకున్న హక్కులను నేటి బీజేపీ ప్రభుత్వం హరించివేస్తోందన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తామని హామీ ఇచ్చే బహుళజాతి కంపెనీలను మాత్రమే మన దేశంలోకి ఆహ్వానించాలని, అప్పుడే ఆయా కంపెనీలలో పని చేసే కార్మికులు శ్రమదోపిడీ నుండి కాపాడుకోబడతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, త్రివేణి, కోట శ్రీనివాస్, అల్వల చంద్రయ్య, దస్తగిరి, రవి, జాడి మల్లయ్య సుదర్శన్, పద్మ అనిత, సాయికృష్ణ, శంకర్, సంజీవ్, శంకరమ్మ, రవి పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో...

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ) 327 ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ట్రాన్స్‌కో డివిజన్ కార్యాయంలో మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎమ్మాజి సతీష్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం చేసే పోరాటాలలో తమ సంఘం ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీనివాస్, కంపెనీ ఉపాధ్యక్షులు రామకృష్ణ, నాయకులు శ్రీనివాస్, ప్రదీప్, ప్రవీణ్, కుమారస్వామి, కేదారి, రాంచందర్, బుచ్చిబాబు, శకుంతల, రమాదేవి, లత, లక్ష్మి పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కాగజ్‌నగర్‌లోని సివిల్ సప్లయి గోదాంలో మేడే వేడుకలు నిర్వహించారు. జెండాను సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, హేమాజీ, కిషన్, సురేష్, రాజు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలోని కనకయ్య స్థూపంతో పాటు పార్టీ కార్యాయం వద్ద, కాగజ్‌నగర్ మండలం చింతగూడ, వల్లకొండ గ్రామాలలో జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి చాంద్‌పాషా, నాయకులు లచ్చన్న, బండారు తిరుపతి, రత్నం పోశన్న, ప్రసాద్, చంద్రన్న, రమేష్, పీడీఎస్‌యూ నాయకులు బౌరె కళ్యాణ్, జగజంపుల తిరుపతి పాల్గొన్నారు.



సివిల్ సప్లయి గోదాం వద్ద పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వేసవి క్రీడా శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా క్రీడా శాఖాధికారిణి రమాదేవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నెల రోజుల పాటు నిర్వహించే వేసవి క్రీడా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల శాఖ అధికారిణి రమాదేవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో క్రీడ శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి సెలవులు వృథా కాకుండా వేసవి క్రీడా శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 11 క్రీడలకు సంబంధించి క్రీడా శిబిరాలున్నాయన్నారు. వేరువేరుగా 11 మంది శిక్షకులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఆయా క్రీడల్లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు శిక్షణ కోసం సంబంధిత శిక్షకులను సంప్రదించాలన్నారు. వేసవికాలం నేపథ్యంలో విద్యార్థులు సెల్ ఫోన్‌లకు అతుక్కుపోకుండా వారిలో క్రీడా నైపుణ్యాలు పెంపొందించే ఉద్దేశంతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సోనియా, గిరిజన క్రీడల అధికారి బండ మీనా రెడ్డి, అథ్లెటిక్స్ శిక్షకుడు విద్యాసాగర్, పీఈటీ గుండం లక్ష్మణ్, క్యాంపు శిక్షకులు శ్రీనివాస్, రవి, రాకేష్, తిరుపతి, సాయి, పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపించాలి

నవతెలంగాణ-కెరమెరి

ప్రశ్నించే గొంతును పార్లమెంట్‌కు పంపించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని కెస్లాగూడ, సుల్తాన్ గూడ గ్రామాల్లో పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 5 గ్యారంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. ప్రజా గొంతుక, ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన మహిళగా గుర్తింపు పొందిన ఆత్రం సుగుణక్కను చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో యువ నాయకులు సుజాయిత్ ఖాన్, ఆయుజ్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం

- ప్రథమ చికిత్సకే పరిమితమైన పీహెచ్‌సీ
- వైద్య సేవలు అందక అల్లాడుతున్న గ్రామీణులు
- అత్యవసరమైతే ప్రయివేటే దిక్కు
- స్థానికంగా ఉండని వైద్య సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు



దహెగాంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం



ప్రాథమిక ఆరోగ్యంలో రోగులను పరిశీలిస్తున్న స్టాఫ్ నర్సులు

నవతెలంగాణ-దహెగాం

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆస్పత్రులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటి పరిష్కారానికి కృషి చేయాల్సిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీల జాడ లేకుండా పోయాయి. ఆరోగ్య సిబ్బందిని అడిగే వారు లేక.. వచ్చిన వారికి వైద్యం అందక గ్రామీణ రోగులు అల్లాడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు అనారోగ్యం వచ్చినట్టు అయింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేవలం ప్రథమిక చికిత్సకే పరిమితమైంది. ఆస్పత్రిలో సరిపడా వసతులు ఉన్నాయా..? వైద్యులు ఉన్నారా..? సరిపడా మందులు ఉన్నాయా..? వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటున్నారా లేదా అత్యవసర పరిస్థితులు వస్తే సరైన చికిత్స అందుతుందా లేదా, ఆస్పత్రికి వచ్చే రోగులు ఏ రకమైన ఇబ్బందులు పడుతున్నారు..? ఉచిత వైద్యం ఏ స్థాయిలో అందుతుందో చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యమందించాలనే ఆశయం ఘనమైనప్పటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, స్థానిక సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఆశయం నీరుగారిపోతుంది.

ఒకేఒక పీహెచ్‌సీ...

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మారుమూల మండలం దహెగాం. మండలం సుమారు 60 మీటర్ల మేర వైశాల్యం కలిగి ఉంటుంది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం 49 గ్రామాలున్నాయి. వీటిలో 27835 మంది జనాభా నివసిస్తున్నారు. విస్తీర్ణం పరంగా మండలం పెద్దది అయినప్పటికీ 49 గ్రామాలకు ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడం వల్ల ప్రజలకు సరైన వైద్యం అందడంలేదు. దీంతో స్థానిక ఆర్‌ఎంపీలను ఆశ్రయించడంతో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లి పట్టణాల్లో చికిత్సలు చేయించుకొని అప్పుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

అత్యవసరమైతే ప్రయివేటే దిక్కు...

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా వైద్యసదుపాయాలు లేకపోవడం, దానికితోడు ఇన్‌చార్జి వైద్యాధికారి సైతం చుట్టపుచూపులా వచ్చిపోతుండడంతో ప్రజలకు వైద్యం సక్రమంగా అందడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చినట్టయితే క్రిందిస్థాయి సిబ్బంది ప్రథమ చికిత్స అందించి వేరే ఆస్పత్రికి వెళ్లలనే ఉచిత సలహా ఇవ్వడంతో రోగులు చేసేదేమీలేక కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల లాంటి సుదూర పట్టణాలకు వెళ్లి ప్రాణాలు కాపాడుకోవాల్సిన పరిస్థితి. గర్భిణులు సైతం ఆస్పత్రులకు వెళ్లి చెకప్ చేయించుకోవడం తప్పా డెలివరీ కోసం 30 కిలోమీటర్ల దూరంలోని కాగజ్‌నగర్ లేదా 60 కిలోమీటర్ల దూరంలో గల మంచిర్యాల పట్టణానికి వెళ్లకతప్పని పరిస్థితి నెలకొంది.

స్థానికంగా ఉండని సిబ్బంది...

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ ఉండడంతో ఆమె తిర్యాణి మండలం రొంపెల్లిల, దహెగాం మండల కేంద్రంలోనూ విధులు నిర్వహించాల్సి వస్తుంది. దీంతో ఆమె మండల కేంద్రంలో ఉండడంలేదు. అలాగే ఇతర క్రిందిస్థాయి సిబ్బంది కూడా స్థానికంగా ఉండడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఉద్యోగస్తులు తమ విధులు నిర్వర్తించే చోటే నివాసముండాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు సరైన వైద్యం అందించడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకొంతమంది సిబ్బంది అయితే సుదూర ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. ఉన్నతాధికారులు సైతం తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంపై జనాలు మండిపడుతున్నారు. వైద్యసిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతో రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు కేవలం అటెండరే దిక్కవుతున్నాడని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన సేవలు ప్రజలకు అందేలా చూడాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోగులకు కనీసం మంచినీల్లు కూడా లేవు



నల్లి ధామోధర్,
తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మడల ప్రధాన కార్యదర్శి

ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు మాత్రలు వేసుకోవడానికి కనీసం మంచినీల్లు కూడా లేని దుస్థితి నెలకొంది. వేసవికాలంలో వివిధ గ్రామాల నుండి ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వస్తే మంచినీల్ల కోసం ప్రక్కనున్న ఇండ్లకు వెళ్లి అడుక్కొని తాగాల్సి వస్తుంది. వైద్యశాలలో చల్లని నీటి ఫ్రిజ్జు ఉన్నప్పటికీ దానిని బాగు చేయించకుండా ప్రక్కన పడేశారు. ఇన్‌చార్జి వైద్యాధికారి ఉండడం వల్ల మండలవాసులకు సరైన వైద్యమందడంలేదు. పూర్తిస్తాయి వైద్యాధికారిని నియమించడంతో పాటు ఆరోగ్యకేంద్రంలో మౌళిక వసతులు కల్పించాలి.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట రాజు
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా మేడే



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో సీఐటీయూ అనుబంధ సంఘమైన భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ అధ్యక్షతన నిర్వహించిన మే డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కులాలు, మతాల పేరుతో ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్మికులు సంపద సృష్టికర్తలు కావాలే కానీ, ప్రస్తుతం కార్పొరేట్ పెట్టుబడిదారులు సంపద సృష్టికర్తలుగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం వెలిగిపోతుందని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ.లక్ష 70000 కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.80 వేల కోట్లు బడ్జెట్లో కేటాయించడమేంటని ప్రశ్నించారు. కార్మికుల రక్షణ కోసం తీసుకువచ్చిన 1998 చట్టం కూడా రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఇదే సందర్భంలో గుజరాత్‌లో పదికి పైగా పెట్టుబడుదారులు రూ. వేలకోట్ల మోసం చేశాయన్నారు. కార్మిక చట్టాలు అమలు కావడం లేదని 44 చట్టాలను రద్దు చేసిన నాలుగు కోడ్‌లుగా అమలు చేస్తే కార్మికుల కష్టాలు పోతాయని కేంద్ర ప్రభుత్వం మోసం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. అలా చేస్తే ప్రస్తుతం కార్మికులు ప్రమాదంలో మరణిస్తే రూ. 6,30,000 వస్తున్నాయని కోడ్లు అమలు అయితే రూ.నాలుగు లక్షలు మాత్రమే వస్తాయని తెలిపారు. కార్మికుల కోసం ప్రస్తుతం రూ.12 చెల్లించాల్సి ఉందని అదే అమలు అయితే రూ.350 చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ కోడ్‌లతో కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డులో రూ.4,800 కోట్లు ఉండగా రూ.3600 కోట్లు మాత్రమే పంపిణీ చేశారన్నారు. 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉండగా 14 లక్షల మందిని మాత్రమే సభ్యులుగా చేర్చారని తెలిపారు. గతంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్‌కు వెల్ఫేర్ బోర్డు నుండి రూ.500 కోట్లు తీసిందని, ఇదే కాకుండా కరోనా సమయంలో బియ్యం పంపిణీ కోసం రూ.1000 కోట్లు వెల్ఫేర్ బోర్డు నుండి ఖర్చు చేసిందన్నారు. జిల్లాలో 75 వేల మందికి పైగా కార్మికులు ఉండగా కేవలం 15752 మంది మాత్రమే నమోదయ్యారన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటం చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

మే డే వేడుకలను పురస్కరించుకొని భవన నిర్మాణ కార్మిక సంఘంతో పాటు సీఐటీయూ అనుబంధ సంఘాల ప్రతినిధులు జిల్లా కేంద్రాల్లోని గ్రామపంచాయతీ నుండి గాంధీ చౌక్, వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్‌ల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక దినోత్సవ నినాదాలు చేస్తూ ర్యాలీ అధ్యంతం ఉత్సాహంగా సాగింది. అనంతరం కార్మిక జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా నాయకులు రామ్ చందర్, మండల అధ్యక్షుడు కమలాకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా నాయకుడు కృష్ణమాచారి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీకానంద్, కార్తీక్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు కోరంగ మాలశ్రీ, కోట శ్రీనివాస్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు సమ్మయ్య బాలేష్, శకుంతల, వనిత, కార్మికులు పాల్గొన్నారు.

నేటి సీఎం సభకు ముమ్మరంగా ఏర్పాట్లు

- సభ స్థలిని పరిశీలించిన మంత్రి సీతక్క
- ఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క కాంగ్రెస్ నాయకులు

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు జిల్లా శ్రేణులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం సభకు 25 నుండి 30 వేల మంది జన సమీకరణకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన గల మైదానంలో మధ్యాహ్నం 1 గంటకు సభస్థలిలో వీవీఐపీ గ్యాలరీల ఏర్పాటుతో పాటు సభకు వచ్చేవారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభకు సంబంధించి గ్రామాల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు జనాలను తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎదుట జిల్లా నాయకులు వారి బలాన్ని ప్రదర్శించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ద్వితీయ శ్రేణి నాయకులు చెబుతున్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి సీతక్క

జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచార సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో మంత్రి సీతక్క ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఎండ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తాగు నీరు, నీడకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సభను విజయవంతం చేసేల శ్రేణులు మరింత కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, నాయకులు అనిల్, అసిఫ్, చరణ్, అబ్దుల్ల పాల్గొన్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొనడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు ఎస్పీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రధాన రహదారులపై పోలీసులు పహారా నిర్వహిస్తున్నారు. నూతన కలెక్టరేట్ నుండి రోడ్డు మార్గం ద్వారా సభాస్థలికి చేరుకోనున్న నేపథ్యంలో ఆ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



సీఎం సభ స్థలి వద్ద బందోబస్తు గురించి తెలుసుకుంటున్న ఎస్పీ సురేష్ కుమార్

బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ బుధవారం కాగజ్‌నగర్‌లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఉదయమే స్థానిక ఎస్పీఎం క్రీడా మైదానానికి స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి వాకింగ్‌కు వెళ్లిన ఆయన అక్కడ వాకర్స్‌ను కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక సిర్పూరు పేపర్ మిల్లు గేటు వద్దకు వెళ్లి అక్కడ కార్మికులను కలిశారు. మిల్లులోనికి వెళ్తున్న ప్రతీ కార్మికుడిని కలిసి కార్మికుల కష్టాల గురించి తెలుసుకున్నారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తర్వాత నౌగాంబస్తీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్‌లోయ, సిందం శ్రీనివాస్, కొండ్ర మనోహర్‌గౌడ్, దెబ్బటి శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, గజ్జల లక్ష్మణ్, వి రమేష్, ముత్తు అశోక్, గజ్జి ప్రసాద్, చిప్పకుర్తి శ్రీనివాస్, జాడి దీపక్, కొండ తిరుపతి, కుమార్‌గౌడ్, అర్జున్, మాజిద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుండి బీజేపీలో చేరికలు

సిర్పూరు నియోజకవర్గం దహెగాం మండలంలోని బోర్లకుంట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్ సమక్షంలో బీజేపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌లతో కలిసి నగేష్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ రత్నం మధూకర్, గ్రామస్తులు రౌతు పత్రు, జుమ్డి విస్తారి, లొనారి సత్యనారాయణ, రత్నం పోశం, శంకర్, సొనులె రమేష్, దుర్గం నానయ్య, సాద్గరి పెంటయ్య సాద్గరి భూజంగరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీని చూసి చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దహెగాం మండల అధ్యక్షులు రాపర్తి ధనుంజయ్, నాయకులు వెన్నంపల్లి సుధాకర్, సాయిచరణ్, సురేష్‌గౌడ్, నాయికిని సత్యనారాయణ పాల్గొన్నారు.



నౌగాంబస్తీలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్

బెజ్జూర్ : బీజేపీ అభ్యర్థి గోడం నగేష్, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మండలంలోని రెబ్బెన గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వా హరీష్ బాబు మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రా చారి, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, నాయకులు శ్రావణ్ రావు, చిలుకయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఉచిత డిగ్రీ, ఉద్యోగం కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ పూర్తైన పేద విద్యార్థుల కోసం ఉచిత డిగ్రీ సీటు ఇవ్వడంతో పాటు ఎంఎస్ఎస్ లాబరేటరీస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో ఉద్యోగం కల్పించడానికి ఈనెల 3న జిల్లా కేంద్రంలోని చైతన్య కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో రేపు ఉదయం 9 గంటల వరకు కళాశాలలో హాజరుకావాలని ఇతర వివరాల కోసం 6303204295, 9440243777 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

నవతెలంగాణ-తాంసి



ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయబ్ తహసీల్దార్ విష్ణు జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ప్రచార రథం ద్వారా ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విష్ణు జాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలన్నారు. అదే విధంగా సీ విజిల్ యాప్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేష్, జూనియర్ అసిస్టెంట్ దారవేణి రాఘవేంద్ర, సిబ్బంది ప్రశాంత్, అనసూయ ఉన్నారు.

మండల టాపర్‌గా ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని జెండావెంకటాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పది ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యశోదర తెలిపారు. ఇందులో భాగంగా అత్యధిక జీపీఏ సాధించిన మండల టాపర్ సాత్విక 9.8 జీపీఏ సాదించి మండల టాపర్‌గా నిలిచింది. ఆమెతోపాటు 9 జీపీఏ సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోదర మాట్లాడుతూ 100 శాతం ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా మే డే వేడుకలు

నవతెలంగాణ-కాసిపేట

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా మే డే వేడుకలు నిర్వహించారు. కాసిపేట మండలంలోని సోమగూడెం భరత్ కాలనీ కొమురయ్య భవన్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఎదుట సీపీఐ నాయకుడు జాడి పోశం జెండా ఎగరావేశారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గేట్ ఎదుట సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి జెండా ఎగరవేశారు. కాసిపేట-1 గనిపై ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీ నారాయణ, కాసిపేట-2 ఇంక్లైన్ పై బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ కార్మికుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాల రాస్తుందని, మే డే స్ఫూర్తితో హక్కులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. చత్తీస్ ఘడ్ అడువులలో లక్ష మంది సైన్యంతో ప్రవేశం చేసి అక్కడ ఉన్న ఆదివాసీ హక్కులను, చట్టాలను తుంగలో తొక్కుతున్నరన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వర్‌రావు, గొల్ల శ్రీనివాస్, చొప్పరి శ్రీహరి, వి రాజేందర్, సురేశ్, చౌడ లింగయ్య, సంపత్, సంతోష్, కోల్ల కమలాకర్, రంజిత్ కుమార్, ఆడెపు రవీందర్, పిల్లి వెంకటస్వామి, బల్లెం శ్రీనివాస్, రఘురాం, బియ్యాల రాజన్న పాల్గొన్నారు.

జైపూర్ : మే డే సందర్భంగా ఐకే-1ఏ గని ఆవరణలో బుధవారం ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి ఆద్వర్యంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు విజయ్ కుమార్‌తో కలిసి కార్మిక జెండాను ఎగురువేశారు. అనంతరం అమరవీరులకు ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐకే ఓపెన్ కాస్ట్ గని పిట్ కార్యదర్శి శ్రీకాంత్, సహాయ కార్యదర్శి రాజయ్య, రాములు, మధుకర్, సురేష్, వెంకటస్వామి, రమేష్, జై సూర్య గణేష్, శేఖర్, సాగర్ పాల్గొన్నారు. అదేవిదంగా జైపూర్ సింగరేణి విద్యుత్ థర్మల్ ప్లాంట్ ఎదురుగా కార్మికులతో కలిసి మేడే ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కార్మికులకు వెట్టి చాకిరి శ్రమదోపిడి తప్పడం లేదని అన్నారు. పవర్ ప్లాంట్ పరిసర గ్రామాలైన గంగిపల్లి, జైపూర్, ఎలుకంటి, పెగడపల్లి తదితర గ్రామాల వారు విలువైన వ్యవసాయ భూములను ప్లాంట్ ఏర్పాటుకు దారా దత్త చేసి ఉపాధికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములను సమకూర్చిన రైతులకు సరైన పరిహారం చెల్లించకపోగా ప్లాంట్ ఆధారంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, నాయకులు సాయి కృష్ణ, ఎలుక రమేష్, సత్యనారాయణ, చారి, రామగిరి మల్లేష్, మామిడాల రమేష్, రిక్కుల రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : పట్టణంలోని స్థానిక సూపర్ బజార్‌లో ఐఎన్టీయూసీ కార్యాలయంలో బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి జెండా ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రిటైర్డ్ కార్మికులకు సన్మానం చేశారు. అలాగే ఏఐటీయూసీ నాయకులు బత్తుల రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

లక్షెట్టిపేట : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట ఊత్కూర్ చౌరస్తా వద్ద హమాలి కార్మికులు మే డేను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కేతిరెడ్డి రమణారెడ్డి ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేదరి దేవవరం, అవునూరి వెంకటేష్, రాచర్ల రవి కిరణ్, లింగంపల్లి భానుచందర్, బైరి రాజన్న, అన్నం శేఖర్ పాల్గొన్నారు.

జన్నారం : మండల కేంద్రంలో బుధవారం సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ దగ్గర, మార్కెట్ యార్డ్ సమీపంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల హమాలీ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కానీకారం అశోక్, కొండగుర్ల లింగన్న, కూకటికారి బుచ్చయ్య, అంబటి లక్ష్మణ్, మగ్గిడి జయ, ఒడిపల్లి అంజయ్య, శారద, హమాలీ సంఘం నాయకులు మేకల సత్యనారాయణ, బోయిని సత్యన్నా, లావుడియా అరవింద్ కాణిపాక హరీష్, శ్రీరవేణి సత్యన్నా పాల్గొన్నారు.

మందమర్రి : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం గనులు, డిపార్ట్మెంట్‌లపై 138వ మే డే వేడుకులను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమ నాధుని సుదర్శన్ పాల్గొన్నారు. కేకే ఓసి నుంచి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, కేకే-5 నుంచి వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, షిర్కే ప్రాణహిత కాలనీలో బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, వర్క్ షాప్‌లో పెద్దపెల్లి బానయ్య, నారాయణ స్తూపం వద్ద బ్రాంచ్ సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం పూలమాల వేసి మోట పలుకుల మహేందర్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది శ్రీనివాస్, సోమిశెట్టి రాజేశం, పెద్దపెల్లి బానయ్య, టేకుమట్ల తిరుపతి, అంతోని దినేష్, ఫిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్, సిహెచ్ పి శర్మ, మద్రి కుమారు, సంజీవ్ కుమార్, కలవల శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ నాయకుడు సత్యనారాయణ, మనోహర్ పాల్గొన్నారు.

నస్పూర్ : మున్సిపాలిటీ పరిధిలో 138వ ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలు పలువురు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ సీఐటీయూ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) వెంగళ శ్రీనివాస్ అధ్యక్షతన బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కస్తూరి చంద్రశేఖర్ బానే సుధాకర్, మిడివెల్లి శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, శ్రీధర్, పెరుక సదానందం, సంఘం రాజయ్య పాల్గొన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, ఎస్కే బాజీ సైదా, కొట్టే కిషన్‌రావు, కొమురయ్య పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో కార్మిక విగ్రహానికి పూలమాల వేసి మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ నీలబోయిన కుమార్, ఏరియా కార్యదర్శి సదిరం రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాడీ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



జన్నారం : మే డే వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు



కాసిపేటలో..



జైపూర్‌లో..



రామకృష్ణాపూర్‌లో..



లక్షెట్టిపేటలో..



మందమర్రిలో..

జీపీ కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-జైపూర్



భీమారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్మిక దినోత్సవం పురస్కరించుకొని భీమారం ఎంపీడీఓ రాధా రాథోడ్ గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తులు బూట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సతీష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మతోన్మాద, కార్మిక వ్యతిరేక బీజేపీ ఓడించండి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మతోన్మాద కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పట్టణ ఏరియాలోని జెండాలను ఆవిష్కరించారు. అనంతరం బ్రాంచ్ నాయకులు మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలతో కార్మికులను విచ్ఛిన్నం చేస్తూ కార్మిక చట్టాన్ని మార్చి చట్టబద్ధత కల్పించేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడు రామగిరి రామస్వామి, అబ్బోజీ రమణ, వడ్లకొండ ఐలయ్య, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, ఆర్గనైజర్ భేతి భరత్, వివిధ గనుల పిట్ సెక్రటరీలు నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని గండి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. లింగట్ల గ్రామానికి చెందిన రాథోడ్ మహేందర్(25) ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రోజు లాగే ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్లి వస్తున్న క్రమంలో బుధవారం మార్గమధ్యలో దూది గండి వద్ద 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన వివిధ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనిత సీతా రామరాజన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మోడల్ బీపీగా ఎంపికైన ముత్నూర్ పంచాయతీలో మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తదితర పనులు వంద శాతం పూర్తి కావాలని సూచించారు. దాంతో పాటు పల్లే ప్రకృతివనం పనులతో పాటు వేసవి కాలంలో రెండు పూటల నీటిని మొక్కలకు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట డీపీఓ శ్రీనివాస్, డీఎల్‌పీఓ ఫనిందర్ రావ్, ఎంపీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో నీటి ఎద్దడి

నవతెలంగాణ-నేరడిగొండ

నేరడిగొండ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గత వారం రోజులుగా తాగు నీటి ఎద్దడి ఏర్పడింది. బోరు బావిలు చెడిపోయి వారం రోజులు అవుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడంలేదని మిషన్ భగీరథ నీళ్ళు కూడా సరఫరా కావడం లేరు. సమస్య ఎవరికి చెప్పిన పట్టించుకోవడంలేదని కనీసం వాటర్ ట్యాంకు ద్వారా అయిన నీటిని సరఫరా చేయాలని కాలనివాసులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్న జిజ్ఞాస విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ తెలుగు విభాగం విద్యార్థులు రూపొందించిన "ఆదిలాబాద్ జిల్లా కొలాములు జీవనస్థితిగతులు" అనే జిజ్ఞాస ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విషయం తెలిసిందే. బుధవారం సోమాజీగూడ హైదరాబాద్ సంస్కృతి, రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్ మార్గదర్శకులు ఏ.కపిల్, విద్యార్థులు పావని, సాయి ప్రియ, నిఖిత, రుచిత, సుస్మిత లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, కళాశాల విద్య కమీషనర్ బుర్రా వెంకటేశం చేతులమీదుగా రూ.30 వేల నగదు చెక్కును, సర్టిఫికెట్లను అందుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి తెలుగు ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని కమిషనర్ అన్నారు. బహుమతి సాధించిన విద్యార్థులు, తెలుగు విభాగం అధ్యాపకులు సంతోష్ కుమార్‌ను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

గడప గడపకు బాల్క సుమన్ ప్రచారం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కు మద్దతుగా బుధవారం పట్టణ పరిధిలోని 3, 4, 19, 20 వార్డులో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఆర్కే-4 గడ్డపై ఏర్పాటు చేసిన ప్రచార సభలో బాల్క సుమన్ ప్రసంగిస్తూ, రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కొప్పుల ఈశ్వర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణనాయకులు పాల్గొన్నారు.

హాకీ క్రీడలో ప్రతిభ కనబరిచిన క్రాంతి కిరణ్‌కు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి

ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టర్ జట్టుకు ఎంపికై హాకీ క్రీడలో తనదైన శైలిలో ఆడి సత్తా చాటి బహుమతి సాధించిన శనిగారపు క్రాంతి కిరణ్‌ను బుధవారం మందమర్రి వాకర్స్ షేర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేకే-5 గనిలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న క్రాంతి అథ్లెటిక్ పోటీల్లో వివిధ విభాగాల్లో సత్తా చాటుతూ బహుమతులు సాధించి తను పుట్టిన మందమర్రి పేరుని దేశం మొత్తం చాటుతున్నారని అన్నారు. కోల్ ఇండియాలో జరగబోవు పోటీలకు కూడా ఎంపిక అయ్యారని ఇదే స్ఫూర్తితో కష్టపడుతూ మరెన్నో పథకాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి అన్నారు. బుధవారం మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాలలో వాలీబాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. దీనిని కలమడుగు పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ శిబిరం పీడీ బోర్లకుంట సాగర్ పర్యవేక్షణలో 1వ తేది నుంచి 31 తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రమేష్, లక్ష్మణ్, కిషన్‌గౌడ్, పోచయ్య, కమలాకర్, రిజ్వాన్, రాజేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కలమడుగు గ్రామంలో ఓటర్లకు ఓటరు స్లిప్పుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటర్ స్లిప్పులను తీసుకోవాలన్నారు. ఇంటింటికి తప్పనిసరిగా అందించాలని బీఎల్‌ఓ లకు సూచించారు. ఓటర్ స్లిప్పులు అందరివారు పోలింగ్ కేంద్రం వద్ద కూడా తమ ఓటు స్లిప్పును తీసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. అన్ని గ్రామాల్లో బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్పులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు అన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-జన్నారం



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన బీజేపీ ఇన్‌చార్జి సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కళ్లెం తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్‌కు చెందిన లోతొర్రే మాజీ సర్పంచ్ నర్సింగరావు, టీజీపల్లె గ్రామానికి చెందిన వెంకన్న ఇంధన్‌పల్లి గ్రామానికి చెందిన కూచాడి కమలాకర్‌రావు, బంజారా సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర భీమ్లా నాయక్ వారి అనుచరులు సుమారు 50 మందితో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను, ప్రజలకు తెలపాలన్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య, గుర్రం మోహన్ రెడ్డి, ముత్యం రాజన్న, సయ్యద్ పసివుల్లా, మామిడిపల్లి ఇందయ్య, దూమల్ల రమేష్, టేకుమట్ల పంకజ, మున్ను, పాదం రాకేష్, గొర్రె మహేష్ యాదవ్, షాకీర్ అలీ, రాహుల్ యాదవ్, అబ్దుల్ ముజ్జు, నసేశ్వర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం వస్తేనే జీవితాలు బాగుపడతాయి



నవతెలంగాణ-జన్నారం

దేశంలో ఇందిరమ్మ రాజ్యం వస్తేనే అందరి జీవితాలు బాగుపడతాయని మాజీ జడ్పీటీసీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు టేకుమెట్ల పంకజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గత పది సంవత్సరాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిందని మీ అందరి ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని అన్నారు. అదేవిదంగా దేశంలో సైతం ఇందిరమ్మ రాజ్యం రావాలంటే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అందరూ చేతిగుర్తుకు ఓటు వేసి మండలానికి చెందిన ఆదివాసీ ఆడబిడ్డ ఆత్రం సుగునక్కను భారీ మెజారిటితో గెలిపించి పార్లమెంటుకు పంపి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. గతంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమ పాలన ఉండేదని అప్పుడు దేశంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిందని అయన తెలిపారు. అదేవిదంగా రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రజా సంక్షేమ పనులను చూసి ప్రజలు కాంగ్రెస్‌కు ప్రతి గ్రామంలో బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ప్రజాధారణ చూసి ఓర్చుకోలేక పోతున్నారని ఆరోపించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఇక్కడ అక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉండాలని మే 13 జరిగే పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విదంగా ప్రతి ఒక్కరు చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఎన్నికల ఖర్చును నిర్ణిత ప్రొఫార్మలో పొందుపరచాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేసే ప్రతి అభ్యర్థి ఖచ్చితంగా వారి ఖర్చులకు సంబందించిన అకౌంట్లను భారత ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 77 ప్రకారం ప్రతి అభ్యర్థి తాను చేయబడిన ఎన్నికల ఖర్చులను నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరచాలని కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ఎన్నికల కమీషనర్ ద్వారా నియమించబడిన వ్యయ పరిశీలకుల ద్వారా తనిఖీ చేయించాలని, అభ్యర్థి కాని లేక అతని ద్వారా నియమించబడిన ఏజెంట్ ద్వారా కాని నిర్దేశించిన పుస్తకములో తమ రోజు వారి ఖర్చులను విధిగా తనిఖీ చేయించాలని పేర్కొన్నారు. నిర్దేశించిన తేదీలలో హాజరు కాకుంటే ఐపీసీ సెక్షన్ 171(1) ప్రకారం ఎఫ్ఐఆర్ సంబందిత కోర్టులో ఫైల్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మే 02, 2024 | www.navatelangana.com

పనులు చేసిన పార్టీని ఆదరించాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



పేదలకు డబుల్‌బెడ్ రూంలను ఇచ్చిన గత బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ భూక్యా జాన్సన్ నాయక్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన పట్టణ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో పర్యటించి ప్రచారం చేశారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఖలీల్, కార్యకర్తలు గౌరికార్ రాజు, సుమన్, రాజగంగన్న, నారాయణ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జైనథ్



ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని పురాతన దేవాలయం శ్రీలక్ష్మీనారాయణ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, ప్రజలతో మమేకమై ఎన్నికల గురించి మాట్లాడుతూ వారికి ఎన్నికల గురించి ఎంత వరకు అవగాహన ఉందో లేదో తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అతని వెంట సీఐ డి.సాయినాథ్, తహసీల్దార్ శ్యామ్ సుందర్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌ని తనిఖీ చేసిన ఎస్పీ



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని ముధోల్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఎస్సై సాయికిరణ్, సీఐ మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పచ్చదనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని చెక్ పోస్ట్‌లతో పాటు, సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పోలిస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐలు మల్లేష్, రాజారెడ్డి, ఎస్సైలు సాయికిరణ్, మోహన్‌రావు, పుష్పవతి పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- లాండ్రి షాపులో ఇస్త్రీ చేస్తు చేయి గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నేరవేరుస్తామని, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని లక్కారాం గ్రామంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓ లాండ్రి షాప్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బట్టలను ఇస్త్రీ చేసి హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అదే విధంగా ఓ అవ్వతో ముచ్చటిస్తు గుబులు పడకు త్వరలో రూ.4 వేల ఫించన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 3 నెలల్లోనే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల ప్రమాద భీమా, రూ.500లకు గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి గొప్ప ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం వృద్ధులకు, అంగవైకల్యం చెందిన వారికీ, వితంతువులకు, రూ.4 వేల ఫించన్ అందిస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ అవలంబిస్తున్న తీరును ఖండిస్తున్నామన్నారు. ఈ దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం ఎంతో అవసరమని, ఆయనను ప్రధానిని చేయడమే మన లక్ష్యం కావాలన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన నాగపూర్ మాజీ సర్పంచ్

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని నాగపూర్ గ్రామమాజీ సర్పంచ్ జాదవ్ సురేష్‌తో పాటు 60 మంది గ్రామస్తులతో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో నిర్మల్‌లో బుధవారం బీజేపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 13 జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి నగేష్‌ను గెలిపించేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, వడ్డే రాజేందర్, పార్టీ మండలాధ్యక్షులు కర్పే విలాస్, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోడం నగేష్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-కౌటాల

ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా గోడం నగేష్‌ను ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని జగదాంబ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన బీజేపీ విజయ సంకల్ప సభలో ఆయన అన్నారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడుతుందని, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్‌ను కమలం పువ్వుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి కేంద్రంకు పంపిస్తే జోడెద్దులుగా పనిచేస్తామని అన్నారు. కేంద్రం నుండి రూ. 1825 కోట్లు తీసుకొచ్చి సిర్పూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. బెల్లంపల్లి నుండి గడ్చిరోలి వరకు రూ.మూడు వేల కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మించనున్నట్టు, అలాగే తాటిపెల్లిలో రైతులు మిర్చీ పంట వేసి కరెంటు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ వచ్చాకే కరెంటు పోయిందన్నారు. ఇదే విషయంపై సీఎండీతో మాట్లాడి నదీ పరివాహక ప్రాంతాల గుండా ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుచేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టాలని సీఎండీ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంగ సత్యనారాయణ, దోని శ్రీశైలం, కొప్పుల శంకర్, కన్నెపెల్లి ఎంపీటీసీ దుర్గం మోతిరాం. బండి రాజేందర్‌గౌడ్, తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.



కార్మిక చట్టాల పునరుద్ధరణకు బీజేపీని ఓడిద్దాం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్
- ఘనంగా 138 మేడే వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మిక చట్టాల పునరుద్ధరణకై మే డే స్ఫూర్తితో కార్మికులు ఐక్యంగా పోరాటానికి సిద్ధమై బీజేపీని ఓడించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. 138వ మేడే సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను బోగే ఉపేందర్, సీపీఐ జెండాను భద్రి సత్యనారాయణ, ఆర్టీసీ జెండాను దివాకర్, బూరుగుడాలో పిడుగు శంకర్, మార్కెట్ హమాలి జెండాను సుధాకర్, సివిల్ సప్లయి హమాలి జెండాను బి.సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల పునరుద్ధరణకై దేశంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని బ్యాంకులను కుదించారదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, నాయకులు శ్రీనివాస్, ప్రకాష్, మోహన్, కొమురక్క పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ప్రపంచవ్యాప్తంగా కార్మికుల బానిస సంకెళ్లు తెగిపోయిన రోజు మేడే దినోత్సవం ప్రత్యేకతాని భవన నిర్మాణ సంఘం ప్రధాన కార్యదర్శి శివరాం అన్నారు. బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక విప్లవం నుండి కార్మికుల శ్రమ దోపిడిని యజమానులు దోచుకున్నారని, దీనికి నిరసనగా ప్రపంచవ్యాప్తంగా కార్మికుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేసి కార్మికుల శ్రమతో పాటు పని దినాలను తగ్గించుకున్నారన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా చేస్తున్న చట్టాలను ప్రతి ఒక్కరు ప్రతిఘటించి హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవధ్యక్షుడు చింతల సత్తయ్య, ఎంపీపీ ఈర్త సత్యనారాయణ, సాయిరె రమేష్, ప్రభాకర్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంలో బుధవారం మేడే వేడుకలను సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా కార్మికులు ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీటీయూ మండల ప్రధాన కార్యదర్శి రమేష్, కోకన్వీనర్ వజ్రమ్మ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పోరాడాలన్నారు. మేడేను స్ఫూర్తిగా తీసుకొని అందరు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జయప్రద, నాయకులు రాజ్‌కుమార్, అరుణ్‌గౌడ్, రవీందర్, మారుతి, మమత, కల్పన, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

వాంకిడి : మేడే దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ముందు హమాలీ సంఘం అధ్యక్షుడు విలాస్ జెండాను ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ప్రక్కన గల స్థలంలో భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు రవి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల అధ్యక్షురాలు విమలాబాయి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి కార్మికులకు కార్యాలయం లేకపోవడంతో రోడ్డు ప్రక్కనే సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాన్ని సంఘం భవనానికి అందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, సింగిల్‌విండో చైర్మన్ జాబిరె పెంటు, డీఎఫ్ఐ అధ్యక్షుడు మౌల్కార్ అశోక్, హమాలీ సంఘం కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బషీర్‌ఖాన్ సీఐటీయూ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు ఏకతాటిపై ఉండి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రేమల, రజియాబేగం పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రం లోని గ్రామపంచాయితీ కార్యాలయంలో ముందు "మే" డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్ విలాస్ మాట్లాడుతూ కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు టి.రవి, ఆశవర్కర్ల మండల అధ్యక్షురాలు బండి అనురాధ, లక్ష్మి అర్చన, మధ్యాహ్న భోజన కార్మికురాలు విమల, కామల, అంగన్‌వాడీలు కళావళి, గ్రామపంచాయతీ కార్మికులు శంరావు, వెంకటి, ప్రమీల పాల్గొన్నారు.

కౌటాల : మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మేడే వేడుకలను పురస్కరించుకొని మండల ప్రధాన కార్యదర్శి మోర్లె నాగేష్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారుల, పాలకవర్గాల దోపిడి దాడులు అణచివేతలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించుకుంటూ వర్గ ఐక్యతను కాపాడుతున్న ప్రజలకు సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను జరుపుకోవడం జరిగిందన్నారు.


ఆసిఫాబాద్


సిర్పూర్(టి)



దహెగాం


కౌటాల

విన్నవించుకున్నా వినలేకపాయే..!

- శ్రమదానం చేసి సర్దుబాటు చేసుకునే

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని గోలేటి విలేజ్‌లోని హనుమాన్ ఆలయం నుండి సేవాలాల్ ఆలయానికి వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో రహదారిపై ఏర్పడిన గుంతలను గోలేటి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేశారు. గోలేటి సేవాలాల్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం శ్రమదానం నిర్వహించి గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మత్తులు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ఎన్నిసార్లు గ్రామ పంచాయతీ అధికారులకు, ప్రభుత్వాలకు విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవు. కాంగ్రెస్ ఏర్పాటైన తర్వాత గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించి అధికారుల పాలనలో జిల్లాలోని పంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్ల స్థితిగతులను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా గుంతలను వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. కానీ ఇప్పటివరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు ఎలాంటి మరమ్మత్తులు చేయకపోవడంతో ఆలయ కమిటి నిర్ణయం మేరకు శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాంను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల కోసం వంద చొప్పున బ్యాలెటింగ్, కంట్రోలింగ్ యూనిట్లు, వీవీప్యాట్ అవసరం ఉన్నందున గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను మొదటి విడత పరిశీలన కార్యక్రమం పూర్తిచేసి పార్లమెంట్ ఎన్నికలలో ఉపయోగిస్తమని తెలిపారు. గోదాంలో ఉన్న సీసీటీవీల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ మధుకర్, డిప్యూటి తహసీల్దార్ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో నూతన బొగ్గు గనులు ప్రారంభం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో నూతన బొగ్గు గనులు ప్రారంభించామని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. 138వ మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే గోలేటి ఎక్స్‌రోడ్డులో జెండాను ఆవిష్కరించారు. సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, నంబాలలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దుర్గం వెంకటేశ్ 138వ మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శంకర్, డ్రైవర్లు మనోహర్, పాపయ్య, నాయికిని సతీష్, కృష్ణ, సంతోష్, వేముర్ల స్వామి, రాజు పాల్గొన్నారు. మే సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం మండలంలోని రాంపూర్ గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు చాపిడి శివ, మండల ఉపాధ్యక్షుడు చల్లూరి కృష్ణ, నాయకులు చాపిడి రవితేజ, రాంటెంకి రఘు, డోంగ్రి తిరుపతి, గ్రామ పంచాయతీ కార్మికులు చాపిడి శ్రీనివాస్ పాల్గొన్నారు. సింగరేణి, అసంఘటిత కార్మికుల హక్కుల రక్షణకై ఎంతటి పోరాటానికైనా సిద్ధమని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. మేడే సందర్భంగా ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో, గోలేటిలోని టీబీజీకేయస్ కార్యాలయంలో మేడే జెండాను ఆవిష్కరించారు. కార్మికులు పోరాడి సాధించిన 44 చట్టాలను యాధవిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి కార్నాదం వెంకన్న, ఏరియా నాయకులు మారిన వెంకటేష్, ఓరం కిరణ్, రాజమణి, మొగిలయ్య, రాజేశం, శ్రీనివాస్, బాబురావు, పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో బుధవారం 138వ మేడేను పురస్కరించుకొని ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్య అతిథులు గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, సీనియర్ కామ్రేడ్ మోడం సత్యనారాయణ, మైనింగ్ సర్దార్ చేతులమీదుగా మేడే జెండాను ఆవిష్కరించారు. గోలేటి కేఎల్ మహేంద్ర భవనం వద్ద ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశైనరావు, సీనియర్ కామ్రేడ్ మాస రాజ, గోలేటి సివిల్ ఆఫీస్ వద్ద బుఖ్యె జగ్గయ్య, గోలేటి సీహెచ్‌పీ వద్ద ఎంబటి రామయ్య మేడే జెండాను ఆవిష్కరించారు. గోలేటి ఏరియాలో 138వ మేడే ఉత్సవాలను కాంట్రాక్టు కార్మికుల ఆధ్వర్యంలో సింగరేణి నర్సరీ, గోలేటి బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మేడే జెండాను సీఐటీయూ కార్యాలయం వద్ద ఎస్‌పీకెఎస్ సీఐటీయూ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోట ప్రభాకర్, శంకర్, విజయ, లక్ష్మీ, మీరాబాయి, దుర్గం కమలాబాయి, చిన్నుబాయి, లక్ష్మి, శారద పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు టీకాలపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందానీ గ్రామంలో గర్భిణులు, బాలింతలకు టీకాలపై ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు, చిన్నపిల్లల టీకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎండతీవ్రతతో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తీవ్రమైన ఎండ ఉండడంతో అత్యవసర పరిస్థితులు ఉంటేనే మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. గర్భిణీలు, బాలింతలు కూడా జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కాంత, ఆశావర్కర్లు గంగుబాయి, కమలబాయి, బాలింతలు, గర్భిణీలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు.

వంద శాతం పోలింగ్ అయ్యేలా చూడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 13న జరిగే పోలింగ్‌లో వంద శాతం పోలింగ్ అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా బీఎల్ ఓ, ఎన్నికల విభాగం అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఓటర్లకు స్లిప్పులను అందిస్తూ పోలింగ్ తేదిని తెలియజేశారు. స్లిప్పులు రాని వారు బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. అక్కడ లేకపోతే ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులతో కూడా ఓటు వేయ్యవచ్చని తెలిపారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉదయమే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని, కేంద్రాల్లో ఇప్పటికే సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

న్యాయవాదుల సమస్యలు తెలుసు : జిల్లా జడ్జి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన తనకు వారి సమస్యలు తెలుసని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు ఎన్రాల నగేష్ నేతత్వంలో న్యాయవాదులను పరిచయం చేశారు. గిరిజన జిల్లా అయిన ఖమ్మంకు చెందిన తాను ఎనిమిది సంవత్సరాల పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశానని తెలిపారు. చెక్ పిటిషన్ వారం రోజులు మించకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. న్యాయవాదిని నమ్మితేనే కేసులు త్వరగా డిస్పోజ్ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి న్యాయమూర్తి డాక్టర్ శివరాం ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కును గెలిపించండి

నవతెలంగాణ-రెబ్బెన

ఆదిలాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గోలేటి మాజీ సర్పంచ్ పోటు సుమలత అన్నారు. బుధవారం మండలంలోని గోలేటిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న వారిని కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాపురావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీను, ఆసిఫ్ అలీ, సంఘం శంకర్, పంబాల శ్రీను, పరికిపండ్ల సతీష్, ప్రతాప్, కడతల మల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారులు నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిశారు. మంగళవారం తిరిగి పార్టీలో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ గంద్రత్ సుజాత, సాజిద్ ఖాన్, అల్లూరి సంజీవరెడ్డిలు నరేందర్‌ను హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గంద్రత్ ఆశన్న, కౌన్సిలర్ అంబకంటి అశోక్ ఉన్నారు.

న్యాయవాదులు బాధ్యతాయుతంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చట్టాల పరిరక్షణ కోసం పని చేసే న్యాయవాదులు, న్యాయమూర్తులు వాటిని పూర్తి స్థాయిలో అమలు చేసేలా బాధ్యతా యుతంగా ఉండాలని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రమీల జైన్ అన్నారు. బుధవారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఇంటర్‌నేషనల్ లేబర్‌డేను నిర్వహించారు. న్యాయమూర్తులు పాల్గొని చట్టాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రమీల జైన్ మాట్లాడుతూ సామాన్య ప్రజల హక్కుల కోసం అనేక చట్టాలు వస్తున్నాయన్నారు. కానీ వాటి గురించి తెలియక వాటిని సద్వినియోగ పరుచుకోవడం లేదన్నారు. వస్తున్న చట్టాల గురించి తెలియజేడంతో పాటు వాటిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆ దిశగా సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు మంజుల, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, పీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.